పంచాయతీ వాటర్ ట్యాంకర్ టైర్లు చోరీ

జిన్నారం, నవంబర్ 24: జిన్నారం గ్రామ పంచాయతీ వాటర్ ట్యాంకర్ టైర్లు చోరీకి గురయ్యాయి. జిన్నారం శివారులోని రంగరాముల గుట్ట వద్ద నిలిపి ఉన్న ట్యాంకర్ నుంచి దొంగలు టైర్లను ఎత్తుకెళ్లడాన్ని గ్రామస్తులు ఆదివారం గుర్తించి గ్రామ పెద్దలకు సమాచారం ఇచ్చారు. ఈ ఘటనపై అందరూ ఆగ్రహం వ్యక్తం చేశారు. టైర్ల చోరీపై జిన్నారం పోలీసులకు సమాచారం ఇచ్చామని, చోరీ చేసిన వారిని గుర్తించేందుకు సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నామని గ్రామస్తులు తెలిపారు.

దరఖాస్తుల పరిశీలన

దిగ్వాల్‌లో దరఖాస్తులను పరిశీలిస్తున్న తహసీల్దార్ బాలశంకర్

కోహీర్, నవంబర్24: కోహీర్‌తోపాటు కవేలి, దిగ్వాల్, తదితర గ్రామాల్లో సంబంధిత బీఎల్వోలు పోలింగ్ స్టేషన్ల వద్ద ఓటరు నమోదు కోసం అర్హుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను తహసీల్దార్ బాలశంకర్ పరిశీలించారు. ఆయన వెంట ఆర్ఐ సత్యనారాయణ ఉన్నారు.

కొనసాగిన ఓటరు నమోదు క్యాంపులు

గుమ్మడిదలలో ఓటునమోదు క్యాంపు నిర్వహిస్తున్న బీఎల్‌వోలు

గుమ్మడిదల, నవంబర్ 24: మండలంలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని అన్ని గ్రామాల్లో నిర్వహించారు. ఆదివారం మండల కేంద్రంతోపాటు బొంతపల్లి, దోమడుగు, అన్నారం, కానుకుంటతోపాటు పలు గ్రామాల్లో బీఎల్‌వోలు ఓటరు నమోదు ప్రక్రియను నిర్వహించారు. 18 ఏండ్లు నిండిన యువతీయువకులు ఓటరుగా నమోదు చేసుకున్నారు. తహసీల్దార్ గంగాభవాని పర్యవేక్షణలో ఓటరు నమోదు క్యాంపులను నిర్వహించారు. ఓటు నమోదు ప్రక్రియకు విశేష స్పందన లభించిందని తహసీల్దార్ తెలిపారు.

తప్పులు లేకుండా డాటా ఎంట్రీ పూర్తి చేయాలి



కందిలో సర్వేకు సంబంధించిన డేటా ఎంట్రీని పరిశీలిస్తున్న ఆర్డీఓ రవీందర్

కంది, నవంబర్ 24: సమగ్ర కుటుంబ సర్వేలో సేకరించిన వివరాల ఆన్‌లైన్ ప్రక్రియను తప్పులు లేకుండా జాగ్రత్తగా చేయాలని ఆర్డీఓ రవీందర్ సూచించారు. ఆదివారం కంది మండలానికి సంబంధించి ఏపీడీ కార్యాలయంలో కొనసాగుతున్న సర్వే డాటా ఎంట్రీని పరిశీలించారు. 25 కంప్యూటర్లతో చేస్తున్న ఎంట్రీని పరిశీలించి పలు సూచనలు చేశారు. మండలంలో 95 శాతం సర్వే పూర్తయిందని, వంద శాతం పూర్తిచేసి త్వరితగతిన ఆన్‌లైన్ చేయాలని సూచించారు. తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీవో మహేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోవాలి

ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

జహీరాబాద్, నవంబర్ 24: ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని న్యాల్‌కల్ మండల డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని రుక్మాపూర్, ముంగి, మిర్జాపూర్(ఎన్), టేకూర్, తాట్‌పల్లి, న్యాల్‌కల్ తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్త ఓటర్ల నమోదుకు 1 జనవరి 2025 నాటికి 18 ఏండ్లు వయస్సు నిండిన యువతీ, యువకులు ఫారం-6, చనిపోతే ఫాం-7, మార్పులు, చేర్పులు, తప్పులు, ఇంటి నంబర్, పుట్టిన తేదీ సవరణకు ఫారం-8లో పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అధికారులు శ్యామ్‌రావు, అధికారులు ప్రకాశ్, అశోక్ ఉన్నారు.

వేతనాలు చెల్లిస్తేనే నీళ్లు!

75 గ్రామాలకు నిలిచిపోయిన భగీరథ నీటి సరఫరా

- అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్య ధోరణితో కార్మికుల ఆందోళన!
- అధికారులతో చర్యలు విఫలం
- రూ.18 వేల వేతనం చెల్లించాలని డిమాండ్
- ఇబ్బందులు పడుతున్న ఆయా మండలాల ప్రజలు

రాఘవపూర్ మిషన్ భగీరథ ఫిల్టర్ బెడ్ వద్ద ఆందోళన చేస్తున్న తాత్కాలిక కార్మికులు(ఫైల్)

జహీరాబాద్, నవంబర్ 24: వేతనాలు చెల్లించడంలేదని మిషన్ భగీరథ తాత్కాలిక కార్మికులు నీటి సరఫరాను నిలిపివేశారు. నాలుగు సార్లు కార్మికులు ఆందోళన చేపడితే ఒక నెల వేతనం చెల్లించి, ఈ నెల 20లోగా ఆరు నెలల వేతనాలు చెల్లిస్తామని సంబంధిత జిల్లా అధికారుల సమక్షంలో కాంట్రాక్టర్ ఒప్పందపత్రాన్ని రాసి ఇచ్చారు. కాంట్రాక్టర్ మాట తప్పడంతో కార్మికులు తాగునీటి సరఫరాను నిలిపివేసి న్యాల్‌కల్ మండలంలోని రాఘవాపూర్ మిషన్ భగీరథ ఫిల్టర్‌బెడ్ వద్ద ఆందోళనకు దిగారు. ఫలితంగా నియోజకవర్గంలోని న్యాల్‌కల్, ఝరాసంగం, అందోల్ నియోజకవర్గంలోని రాయికోడ్ మండలాల్లోని దాదాపు 75 గ్రామాలకు తాగునీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. సమస్య ఇంత తీవ్రంగా ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

ఏడు నెలలుగా ఆర్థిక కష్టాల్లో..

న్యాల్‌కల్ మండలంలోని రాఘవపూర్ శివారులోని మిషన్ భగీరథ ఫిల్టర్ బెడ్ నుంచి ఆయా మండలాలకు రోజూ తాగునీరు సరఫరా అవుతుంది. ఇందులో క్షేత్రస్థాయిలో పనిచేసే తాత్కాలిక కార్మికులకు ఏడు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదు. నెలనెలా వేతనాలు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నామని వాపోయారు. తమకు చెల్లించాల్సిన ఏడు నెలల వేతనాలతో పాటు పెరిగిన ధరలకు అనుగుణంగా తమకు చెల్లిస్తున్న రూ.9,500 వేతనాన్ని రూ.18 వేలకు పెంచి, హెల్త్‌కార్డు, ఐడీకార్డులను మంజూరు చేసి, ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. శనివారం అధికారులు కార్మికులతో చర్యలు జరిపినా ఫలించలేదు. వేతనం రూ.18వేలు ఇస్తేనే విధుల్లో చేరుతామని తేల్చిచెప్పడంతో అధికారులు ఎలాంటి సమాధానం ఇవ్వకుండా వెనుదిరిగి వెళ్లిపోయారు. దీంతో కార్మికులు ఆందోళనను కొనసాగిస్తున్నారు. ఫలితంగా తాగునీటికి ప్రజలు తండ్లాడుతున్నారు.

తాగునీటికి తప్పని ఇబ్బందులు

వేతనాల కోసం మిషన్ భగీరథ కార్మికులు ఆందోళనకు దిగడంతో ఆయా మండలాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. మిషన్ భగీరథ నీళ్లను నమ్ముకొన్న జనం ముప్పుతిప్పలు పడుతున్నారు. బిందెడు నీళ్ల కోసం బోర్లు, బావులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. సంబంధిత అధికారులు భగీరథ కార్మికుల సమస్యలు పరిష్కరించి, తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని ఆయా మండలాలకు చెందిన ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై సంబంధిత మిషన్ భగీరథ అధికారుల దృష్టికి తీసుకెళ్లాగా తాగు నీటికి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామని, కార్మికులకు రావాల్సిన వేతనాలను కాంట్రాక్టర్ వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రభుత్వమే ఆదుకోవాలి

ప్రతి నెలా వేతనాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఇచ్చే ఆరకొర వేతనాలను ఏడు నెలల పాటు చెల్లించకుంటే ఎలా బతికేది. అధికారులు, కాంట్రాక్టర్ కలిసి ఒక నెల జీతం మాత్రమే చెల్లించి కాలయాపన చేస్తారు. తమకు ప్రస్తుతం చెల్లిస్తున్న రూ. రూ.9,500 వేతనాన్ని రూ.18 వేలకు పెంచి, హెల్త్‌కార్డు, ఐడీకార్డులు మంజూరు చేసి, ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. మిషన్ భగీరథ అధికారులు తమ సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళనను ఉధృతం చేస్తాం

- గోపాల్‌రెడ్డి, మిషన్ భగీరథ కార్మికుడు, న్యాల్‌కల్ మండలం

వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ

హాజరైన జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

జహీరాబాద్:పడిపూజలో స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్, నవంబర్ 24: జహీరాబాద్ పట్టణంలోని పస్తాపూర్ గ్రామ సమీపంలోని అయ్యప్పస్వామి ఆలయంలో జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం ఆలయంలో రవీందర్‌రెడ్డి గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన 18వ పడిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వామివారి పడిపూజలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలపై అయ్యప్ప స్వామి కృప, చల్లని చూపు తప్పక ఉంటుందన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని స్వామివారిని వేడుకున్నట్టు తెలిపారు. గతంలో ఆలయంలో భక్తుల సౌకర్యార్థం సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు రూ.15 లక్షలు మంజూరు చేసినందుకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేతోపాటు బీఆర్ఎస్ నాయకులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ పార్టీ నేత, మాజీ కౌన్సిలర్ నామ రవికిరణ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ, నాయకులు పురుషోత్తంరెడ్డి, అమీత్‌కుమార్, నాగరాజ్, రాజ రమేశ్, నరేశ్‌రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు నీల రాజేశ్వర్, కమిటీ సభ్యులు, అయ్యప్పస్వామి దీక్షపరులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



పటాన్‌చెరు: మహాపడిపూజలో పూజలు చేస్తున్న కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్

అయ్యప్ప మహా పడిపూజలో కార్పొరేటర్

పటాన్‌చెరు, నవంబర్ 24: పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామంలో జరిగిన అయ్యప్పస్వామి మహా పడిపూజ కార్యక్రమంలో పటాన్‌చెరు డివిజన్ కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ పాల్గొన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఇంద్రేశంలో సాయితేజ గురుస్వామి ఆధ్వర్యంలో జరిగిన అయ్యప్పస్వామి మహాపడిపూజలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం భానూర్ భూపాల్‌రెడ్డి గురుస్వామి ఆధ్వర్యంలో జరిగిన అయ్యప్పస్వామి మహాపడిపూజలో కార్పొరేటర్ పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

నారాయణఖేడ్, నవంబర్ 24: నారాయణఖేడ్ మండలం రుద్రారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు విఠల్‌రెడ్డి మాతృమూర్తి మృతి చెందడంతో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఆయనవెంట రాజు రెడ్డి, రఘుపతిరెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిజాంపేట్, నవంబర్ 24: మండల కేంద్రమైన నిజాంపేట్‌తోపాటు బాచేపల్లి 33/11 కేవీ పరిధిలోని గ్రామాలకు సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు నారాయణఖేడ్ సబ్ డివిజన్ విద్యుత్ అధికారి నాగిరెడ్డి, ఏఈ శృతి ఆదివారం ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

వనదుర్గ సన్నిధిలో కార్తికమాస భోజనాలు



వనభోజనాలకు హాజరైన కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకనంద

జిన్నారం, నవంబర్ 24: వనదుర్గ సన్నిధిలో కార్తికమాస భోజనాలు ఏర్పాటు చేశారు. ఆదివారం జిన్నారం మండలం ఖాజీపల్లి గ్రామ పరిధిలోని అడవిలో వనదుర్గామాత దేవాలయంవద్ద పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో కార్తికమాసం వన భోజనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకనంద ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను చూసి అభినందించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టీఆర్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వల్లకంటి రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు సామల వెంకటేశ్, నాయకులు వడిచర్ల మారుతి, ఆలయ నిర్వాహకురాలు సునీత, పద్మశాలి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కృష్ణానంద ఆశ్రమంలో రుద్రాభిషేకాలు

కార్తిక దీపోత్సవాన్ని ప్రారంభిస్తున్న గురుమాధవానంద సరస్వతి

గుమ్మడిదల, నవంబర్ 24: కృష్ణానంద ఆశ్రమంలో తోగుట పాఠాధిపతి గురుమాధవానంద సరస్వతి పర్యవేక్షణలో కార్తిక దీపోత్సవం, సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహించారు. గుమ్మడిదలలోని కృష్ణానంద ఆశ్రమంలో నిర్వహించిన సామూహిక రుద్రాభిషేకాల్లో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గురుమాధవానంద సరస్వతి కార్తిక దీపోత్సవాన్ని ప్రారంభించారు. పంచముఖి ఈశ్వరుడి, లక్ష్మీగణతి దర్శనం చేసుకున్నారు. అనంతరం వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ దైవారాధన చేయాలని సూచించారు.

అపూర్వ సమ్మేళనం

సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండల పరిధిలోని అంతకపేట జడ్పీ హెచ్ఎస్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. 2000-01 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఒక చోట చేరి అలనాటి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

- అక్కన్నపేట, నవంబర్ 24

ఇస్నాపూర్ వరకు మెట్రోను విస్తరించాలి

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ

పటాన్‌చెరు, నవంబర్ 24: మియాపూర్ నుంచి ఇస్నాపూర్ వరకు మెట్రో రైలును విస్తరించాలని సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే, మెట్రో రైల్ సాధన సమితి అధ్యక్షుడు సత్యనారాయణ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కోరారు. మెట్రో రైలు సాధన సమితి సభ్యులతో కలిసి ఆదివారం నగరంలోని కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మియాపూర్‌నుంచి ఇస్నాపూర్ వరకు మెట్రో రైలును పొడిగిస్తామని ప్రతిపాదించిందని గుర్తు చేశారు. జిల్లాలో పరిశ్రమలు అధికంగా ఉండటంతోపాటు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, కార్మికులు, మహిళలు దూర ప్రాంతాల నుంచి వచ్చి విధులు నిర్వహిస్తారన్నారు. లక్షలాది మంది నిత్యం బస్సుల్లో ప్రయాణిస్తూ ట్రాఫిక్‌లో చిక్కుకొని విధులను సక్రమంగా హాజరుకాలేని దుస్థితి నెలకొందన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి మెట్రో ను ఇస్నాపూర్ వరకు పొడిగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం మెదక్ ఎంపీ రఘునందన్‌రావును కలిసి మెట్రో రైలు పొడిగింపునకు సహకరించాలని వినతిపత్రం అందజేశారు. మంత్రి, ఎంపీ ఇద్దరూ సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో రుద్రారం శంకర్, జర్నలిస్టు అబ్దుల్ బాసిత్, ఈర్ల రాజుముదిరాజ్, మెట్టు శ్రీధర్, పన్యాల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

తాడ్దాన్‌పల్లి చౌరస్తాలో బ్రిడ్జి నిర్మించాలి

మాట్లాడుతున్న కాశపాగ ఇమ్మయ్య

పుల్కల్, నవంబర్ 24: ఉమ్మడి మండల పరిధిలోని సింగూరు (తాడ్దాన్‌పల్లి) చౌరస్తా నాందేడ్ - అఖోల జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ నిర్మిస్తే ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉండదని జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు కాశపాగ ఇమ్మయ్య అన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడారు. గతంలో చౌరస్తా వద్ద ఫ్లైఓవర్ నిర్మించాలని పలుమార్లు ధర్నాలు, రాస్తారోకోలు చేసినా.. ప్రభుత్వం, అధికారులు స్పందించలేదని ఆరోపించారు. జాతీయ రహదారి సంస్థ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బ్రిడ్జి నిర్మించాలని కోరుతూ ఉమ్మడి పుల్కల్ మండలంలోని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, వార్డు సభ్యులు తీర్మానం చేసిన కాపీని అప్పటి కలెక్టర్‌కు అందజేసినట్లు గుర్తు చేశారు. ఈ విషయంపై అప్పటి జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో లేఖ పంపించినట్లు పేర్కొన్నారు. వివిధ పనుల నిమిత్తం ఆయా గ్రామాల ప్రజలు ఈ చౌరస్తామీదుగా వెళ్లాల్సి వస్తున్నదని, ప్రమాదాలు చోటుచేసుకోకుండా ఉండాలంటే ఫ్లైఓవర్ నిర్మించడం ఒక్కటే మార్గమన్నారు. ఈ విషయంపై మంత్రి దామోదర రాజనర్సింహ చొరవ చూపి తాడ్దాన్‌పల్లి చౌరస్తా వద్ద ఫ్లైఓవర్ నిర్మించేందుకు కృషి చేయాలని కోరారు.

అంతారం జీవన్‌ముక్త పాండురంగ ఆలయం

పోదాం పాండురంగ జాతరకు

- నేటి నుంచి అంతారం పాండురంగ ఉత్సవాలు
- విద్యుత్ కాంతులతో ముస్తాబైన ఆలయం
- భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు

ఆలయ ఊరేగింపు రథం

మునిపల్లి, నవంబర్ 24: పవిత్ర జీవన్ ముక్త పాండురంగ మహారాజ్ ఉత్సవాలకు ఆలయం ముస్తాబైంది. వందల ఏండ్ల చరిత్ర కలిగిన మండల పరిధిలోని అంతారం పాండురంగ ఆలయ ఉత్సవాలు ఏటా కార్తిక బహుళ దశమి నుంచి బహుల చతుర్దశి వరకు నిర్వహిస్తారు. సోమవారం నుంచి 29వ తేదీవరకు ఉత్సవాలు కొనసాగనున్నాయి. భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. జీవన్‌ముక్త పాండురంగ మహారాజ్ ఆలయం మునిపల్లి మండలం అంతారం గ్రామంలో ఉంది. ముంబాయి జాతీయ రహదారిపై గల కంకోల్ గ్రామం నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో అంతారం ఉంటుంది. అక్కడికి వెళ్లేందుకు ఆటోలు, ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉంటుంది. ఈ ఉత్సవాలకు పక్కరాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకుంటారు. అంతారం పాండురంగ మహారాజ్ ఆలయాన్ని అందోల్ నియోజకవర్గం నుంచి పోటీ చేసే ఎమ్మెల్యే అభ్యర్థులు నామినేషన్ వేసే ముందు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేస్తారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. సోమవారం శిఖర స్థాపనతో ప్రారంభం కానున్న ఉత్సవాలు 29న రథోత్సవంతో ముగుస్తాయని ఆలయ నిర్వాహకులు జ్ఞానేశ్వర్(బాలరాజు)మహారాజ్ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థినులకు ఎమ్మెల్యే అభినందనలు

విద్యార్థినులను అభినందిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

కోహీర్, నవంబర్24: జిల్లా వైజ్ఞానిక ప్రదర్శన ముగింపు వేడుకలను పురస్కరించుకొని తమ విద్యార్థినులు సంగారెడ్డి పట్టణంలో శనివారం రాత్రి చేపట్టిన కోలాటం, తదితర సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించిన అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ వారిని అభినందించారని పీచెర్యాగడి జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేశ్ ఆదివారం తెలిపారు. పీచెర్యాగడి పాఠశాల బాలికల ప్రదర్శనను చూసి బహుమతి ప్రదానం చేశారని పేర్కొన్నారు. తోటి ఉపాధ్యాయుల శిక్షణలో విద్యతోపాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో రాణిస్తున్న బాలికలను ఆయన మెచ్చుకున్నారు.

కిటకిటలాడిన వీరభద్రస్వామి ఆలయం

బొంతపల్లి వీరభద్రస్వామి దేవాలయంలో కార్తిక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

గుమ్మడిదల, నవంబర్ 24: భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో భక్తులు కార్తిక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. వేలాదిమంది భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం శివనామస్మరణలతో మార్మోగింది. మండలంలోని వీరన్నగూడెంలోని ప్రసిద్ధి గాంచిన భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో ఆదివారం సెలవు దినం కావడంతో వేలాదిమంది భక్తులు దర్శనాలు చేసుకున్నారు. వీరభద్రస్వామికి అభిషేకాలు, ప్రత్యేకపూజలు, భద్రకాళీ అమ్మవారి వద్ద సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. సత్యనారాయణవ్రత మండపం లో భక్తులు సామూహిక సత్యనారాయణ వ్రతాలు, రుద్రాభిషేకాలు, కుంకుమార్చనలు, వీరభద్రస్వామి ప్రస్తాయాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో తులసికోట వద్ద కార్తిక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. వచ్చిన భక్తులకు ఓ భక్తుడు అన్నదానం చేశారు. ఈవో శశిధర్‌గుప్తా, పర్యవేక్షకులు సోమయ్య, సిబ్బంది భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు.

సైబర్ నేరాలతో తస్మాత్ జాగ్రత్త

సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌బీఐ అధికారులు

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 24: సైబర్ నేరాలతో జాగ్రత్తగా ఉండాలని ఎస్‌బీఐ ప్రాంతీయ మేనేజర్ సూర్యప్రకాష్ రావు పేర్కొన్నారు. ఆదివారం కలెక్టరేట్ కార్యాలయ పార్క్ ఆవరణలో ఎస్‌బీఐ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనధికార వెబ్‌సైట్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. పాస్వర్డ్, పిన్ నంబర్లను ఎట్టి పరిస్థితుల్లో ఎవరికీ పంపించరాదన్నారు. కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ గిరికుమార్ నగేశ్ వార్‌రెడ్డి, మేనేజర్లు పద్మజ, రాజేశ్, దేవి పాల్గొన్నారు.

బోరంచ నల్లపోచమ్మ ఆలయంలో పూజలు

నల్లపోచమ్మతల్లిని సందర్శించుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

జహీరాబాద్, నవంబర్ 24: బోరంచ నల్లపోచమ్మ ఆలయాన్ని బీఆర్ఎస్ నాయకులు దర్శించుకున్నారు. ఆదివారం మనూర్ మండలంలోని బోరెంచ గ్రామ శిరారులోని నల్లపోచమ్మ ఆలయాన్ని బీఆర్ఎస్ జహీరాబాద్ పట్టణానికి చేందిన నాయకులు సందర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జహీరాబాద్ మండల, పట్టణ అధ్యక్షులు తట్టు నారాయణ, అమీత్‌కుమార్, బీసీ సెల్ అధ్యక్షుడు రాజరమేశ్, మాజీ సర్పంచ్‌లు చిన్నారెడ్డి, కరుణ్‌రాజ్, నాయకులు సుమన్, ఈశ్వర్, రవి, సతీశ్, సాయి పాల్గొన్నారు.